బుధ వారం
29-11-2023
సంపుటి - 08,
సంచిక - 400
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# తెలంగాణలో ప్రచారానికి తెర

### అమల్లోకి వచ్చిన ఆంక్షలు...పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

- సాయంత్రం 5 గంటలతో ముగిసిన ప్రచారం
- చివరి రోజు జోరుగా రాజకీయ పార్టీల ప్రచాహోరు
- మద్యం అమ్మకాలపై నిషేధం...వైన్, బార్ షాపుల మూత
- ఎస్సెమ్మెస్‌లు, ఇతరత్రా ప్రచారాలపైనా నిషేధం



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. గత రెండు నెలలుగా దద్దరిల్లిన మైకులు మూగబోయాయి. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ముందు 13 నియోజకవర్గాల్లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా 4 గంటలకే ప్రచారం ముగిసింది. ఆ నియోజకవర్గాల్లో సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వరావుపేట, భద్రాచలం నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక్కడ సాయంత్రం 4 గంటలకు ప్రచారం ముగిసిందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. మిగతా నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. నవంబరు 30 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అన్ని నియోజకవర్గాల్లో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3 న కౌంటింగ్ జరిగి ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. తెలంగాణలో సుమారు రెండు నెలలుగా హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. ప్రచారానికి తెర పడింది. నేతలందరూ చివరి నిమిషం వరకూ సర్వశక్తులను ఒడ్డి

3వ పేజీలో...

## రెండ్రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు

మూడ్రోజుల పాటు మద్యం దుకాణాల మూత




**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఈనెల 30న తెలంగాణలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 29,30) తేదీల్లో హైదరాబాద్ పరిధిలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ హైదరాబాద్ కలెక్టర్ మంగళవారం ప్రకటించారు. తిరిగి డిసెంబర్ 1న యదావిధిగా విద్యాసంస్థలు నడవనున్నాయని వెల్లడించారు. ఇదిలావుంటే ఎన్నికల నేపథ్యంలో మూడ్రోజుల పాటు మద్యం దుకాణాలను బంద్ చేశారు. బార్లు కూడా బంద అయ్యాయి. మంగళ,బుధ, గురువారాలు వీటిని మూసేసారు. ఈనెల 30న పోలింగ్ జరగనుంది. ఈ

2వ పేజీలో...


## తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

మార్పు తెలంగాణ నుంచే ప్రారంభం

జాతీయ రాజకీయాల్లో మార్పులకు ఇక్కడే నాంది

సంపూర్ణ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు

మీడియా సమావేశంలో తుమ్మల, పొంగులేటి వెల్లడి



**ఖమ్మం, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణలో జరుగుతున్న ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలే కాదు.. జాతీయ రాజకీయాలను కూడా ప్రభావితం చేయబోతున్నాయని కాంగ్రెస్

3వ పేజీలో...

## తెలంగాణ ప్రచారంలో మార్మోగిన పివి

మాజీ ప్రధానిని తలచుకున్న అన్ని పార్టీలు

భారతరత్న ఇవ్వాలన్న విషయం పట్టించుకోని బిజెపి



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణ ఎన్నికల పుణ్యమా అని దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు పేరు మరోమారు మార్మోగింది. ఆయన పేరు పలకకుండా ప్రచారం సాగలేదు. ఈ విషయంలో ప్రధాన పార్టీలన్నీ తమకు

4వ పేజీలో...

## తెలంగాణలో లక్షా 30వేల ఉద్యోగాల భర్తీ



4వ పేజీలో...

కాంగ్రెస్ రాష్ట్రాల్లో ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినట్లు చూపండి

చూపితే వెంటనే ఓట్లు అడగబోం

కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ కవిత సవాల్

## గెలిస్తే విజయయాత్ర.. లేదంటే శవయాత్ర

హుజూరాబాద్‌లో కౌశిక్ రెడ్డి సెంటిమెంట్ రాజకీయం



**హుజూరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** హుజురాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న కౌశిక్ రెడ్డి సెంటిమెంట్‌తో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఫ్యామిలీతో ప్రచారం చేసిన కౌశిక్ రెడ్డి విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. తొలిసారి టికెట్ దక్కించుకున్న కౌశిక్ రెడ్డి కచ్చితంగా విజయాన్ని ముద్దాడాలని ఊరూవాడా కాలికి చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆయన ఈటెల రాజేందర్‌పై పోటీకి దిగారు. ఆయనతోపాటు భార్య, కుమార్తె కూడా ప్రచారంలో హుషారుగా పాల్గొంటున్నారు. చివరి రోజు ప్రచారంలో పాల్గొన్న కౌశిక్ రెడ్డి తనను కచ్చితంగా గెలిపించాలని అభ్యర్థించారు. గెలవడమో తన కుటుంబం ఆత్మహత్య

3వ పేజీలో...

## కౌశిక్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు: ఈటెల



**కరీంనగర్, నవంబర్ 28 (సమ సమాజం):** బీఆర్ఎస్ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావని హుజురాబాద్ బీజేపీ అభ్యర్థి, మాజీమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ...'నన్ను గెలిపించుకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఒకడు బ్లాక్ మెయిల్ చేస్తుండు. బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావు బిడ్డా. ప్రశాంతంగా ఉన్న హుజూరాబాద్ గడ్డను బ్లాక్ మెయిల్‌కు వాడటం మంచిది కాదు. రాజకీయాలను ఇంతగా దిగజార్చడం చూస్తే బాధగా ఉంది. కేసీఆర్ రెండేళ్లు నన్ను రాసి రంపాన పెట్టాడు. కేసీఆర్‌ను బొంద పెట్టడమే అంతిమ లక్ష్యం అని ఈటల రాజేందర్ చెప్పారు.

## యువ ఓటర్లపైనే బిజెపి ప్రధాన దృష్టి

జాతీయ భావాలతో ఆకట్టుకునేలా ప్రచారం



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి మార్చాక బిజెపిలో కొంత ఊపు తగ్గిందన్న విషయం గుర్తించిన బిజెపి అగ్రనాయకత్వం ఎన్నికల ప్రచారంలో మాత్రం దూకుడు పెంచింది. ప్రధాని మోడీ, అమిత్ షా

3వ పేజీలో...

## దొరల తెలంగాణ కావాలో.... ప్రజల తెలంగాణ కావాలో....

జహీరాబాద్ సభలో కాంగ్రెస్ నేత ప్రియాంక



**సంగారెడ్డి, నవంబర్ 28 (సమ సమాజం):** దొరల తెలంగాణ కావాలో... ప్రజల తెలంగాణ కావాలో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక అన్నారు. దేశంలో ఫామ్ హౌస్‌లో ఉండి పాలించే ఏకైక

3వ పేజీలో...

## తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన గడ్డ సిద్దిపేట

ఎమ్మెల్యేగా గెలిపించి సిఎంను చేసిన గడ్డ గజ్వేల్



- దేశానికి ఆదర్శంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దాను
- ప్రతి ఒక్కరూ ఇక్కడి అభివృద్ధిని గుర్తిస్తున్నారు
- మరింతగా అభివృద్ధితో ముందుకు సాగేలా చేస్తా
- గజ్వేల్ ప్రజాశీర్వాద సభలో సిఎం కెసిఆర్
- ఇందిరమ్మ రాజ్యమంటే దోపిడీయే
- అరాచకాలకు కేరాఫ్ కాంగ్రెస్ పాలన
- వారి పాలన సక్కగ లేకనే ఎన్టీఆర్ పార్టీ పెట్టారు
- తెలంగాణ ఉసురు తీసిందే కాంగ్రెస్
- వరంగల్ ప్రజాశీర్వాద సభలో సిఎం కెసిఆర్
- ముగిసిన కెసిఆర్ ఎన్నికల ప్రచారం
- గజ్వేల సభతో ప్రచారానికి ముగింపు

**గజ్వేల్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన తర్వాత ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు తనకు బలాన్ని ఇచ్చిన గడ్డ సిద్దిపేట అయితే... ఆ తర్వాత.. సాధించిన తెలంగాణను తీర్చిదిద్దడం కోసం తనను ఎమ్మెల్యేను చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రిని చేసిన గడ్డ ఈ గజ్వేల్ అని సిఎం కెసిఆర్ అన్నారు. గజ్వేల్ నా గౌరవాన్ని పెంచింది. నన్ను ఈ స్థాయికి తెచ్చింది. గత తొమ్మిదిన్నర ఏండ్లుగా నేను గజ్వేల్ ప్రాంతం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశాను. ఇప్పుడే పెద్దలు ప్రతాపరెడ్డి గారు మీకు అన్నీ వివరించారు. నేను మళ్లా అవన్నీ చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో మంచి నీళ్ల కోసం నానా ఇబ్బందులు పడిన గజ్వేల్‌కు శాశ్వతంగా ఆ బాధ తీరిపోయింది. సాగు నీటి

3వ పేజీలో...

## తెలంగాణలో మైనార్టీల సంక్షేమానికి కృషి

కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు ఒరిగిందేమీ లేదు

మీడియా సమావేశంలో హోంమంత్రి మహమ్మద్ అలీ



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణలో గంగా జమున తెహజీబ్ కొనసాగుతున్నదని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. 50 ఏండ్లుగా ముస్లింలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో సెక్యులర్ తెలంగాణ కొనసాగుతున్నదని చెప్పారు. ముస్లిం బిడ్డల కోసం ప్రత్యేక గురుకులాలు ఏర్పాటుచేశామన్నారు. పేద ముస్లిం ఆడబిడ్డలకు షాదీ ముబారక్ ఒక వరమని తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మైనార్టీ

3వ పేజీలో...

## కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపుతా

ప్రభుత్వం రాగానే ప్రత్యేకంగా భేటీ ఏర్పాటు చేస్తా



పారిశుద్య, కాంట్రాక్ట్ కార్మికులతో భేటీలో రాహుల్

**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ అన్నారు. కాంగ్రెస్ గెలవగానే.. కార్మికులతో సీఎం సమావేశం అవుతారన్నారు. వారి సమస్యలపై చిత్తవుద్ధితో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో ప్రచారానికి చివరి రోజైన మంగళవారం డెలివరీ బాయ్స్, ఆటో డ్రైవర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, గిగ్ వర్కర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ.. తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టు ఉద్యోగులను అధికారులు వేధిస్తున్నారని సిబ్బంది ఆరోపించారు. తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టర్లు 11 గంటలు పనిచేయిస్తున్నారని కార్మికులు తెలిపారు. సదుపాయాలు అడిగితే ఉద్యోగం మానేయమంటున్నారని ఆవేదన చెందారు. డెలివరీ బాయ్స్, క్యాబ్, ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ.. పోలీసులు చలాన్లతో వేధిస్తున్నారన్నారు. తరచూ ప్రమాదాల బారినపడుతున్నామని డెలివరీ బాయ్స్ సైతం తమ బాధను రాహుల్‌కు చెప్పారు. సంపాదించినదంతా డీజిల్, పెట్రోల్‌కే సరిపోతుందని ఆటోడ్రైవర్లు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డెలివరీ బాయ్స్ విజ్ఞప్తి


3వ పేజీలో...

# తొమ్మిదన్నరేళ్ల కెసిఆర్ పాలనకు టెస్ట్

తెలంగాణ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనపై ప్రజల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా వ్యతిరేకత ఏర్పడ్డ నేపథ్యంలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఎటు తీర్పు ఇవ్వబోతున్నా రన్న ఆసక్తి దేశమంతా నెలకొంది. టిఆర్ఎస్ కాస్తా బిఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో జరుగుతున్న తొలి ఎన్నికాలు కావడంతో అనేక అంశాలు ఈ ఎన్నికల్లో ప్రచారంలో ముందున్నాయి. అన్నింటికి మించి బిఆర్ఎస్, బిజెపిలు ఒక్కటే అన్న వాదన బలంగా ప్రజల్లోకి వెళ్లింది. దీంతో బిజెపిపై ఉన్న అభిమానులు సైతం దీనిని జీర్ణించుకోలేక పోతున్నారు. రైతుబంధు విషయంలో జరిగిన డ్రామాలను కూడా ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరి నిముషం వరకు అనుమతి ఇవ్వడం, తరవాత అనుమతి నిరాకరించడం, ఆ నెపాన్ని కాంగ్రెస్‌పైకి నెట్టడం అంతా ఓ ఎన్నికల ఎత్తుగడగా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కావాలనే ఇలా చేశారన్నది మారుమూల గ్రామాల ప్రజలకు కూడా అర్థం అయ్యింది. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు క్షణాల్లో సమాచారం చేరుతోంది. ఇకపోతే నిరుద్యోగులు పడినన్ని కష్టాలు గతంలో ఉమ్మడి పాలన లో కూడా పడలేదు. ఉద్యోగ నియామకాలు చేయకున్నా లక్షా 30 వేల ఉద్యోగాలు నియమించామన్న బుకాయింపు నిరుద్యోగులను ఆగ్రహానికి గురిచేస్తోంది. ఎక్కడెక్కడ ఎన్ని ఉద్యోగాలు నియమించారో చెప్పకుండా బుకాయింపు సమాధానాలు ఇస్తున్నారు. చిత్తశుద్ధి వుంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్ సక్రమంగా సాగేది. డిఎస్సీ అయితే లేనేలేదు. టీచర్ల బదిలీల ప్రహసనం ఎంత చెప్పుకున్నా తక్కువే. అన్నింటికి మించి సిఎం ప్రజలతో కలవాల్సిన అవసరమేముందన్న మంత్రి కెటిఆర్ తలబిరుసు సమాధానం ప్రజలకు జీర్ణించు కోలేనిదిగా ఉంది. ప్రజాస్వామ్యంలో సిఎం ప్రజలను కలవడం అన్నది జరగాలి. కానీ పదేళ్లుగా కెసిఆర్ అలాంటి వాటికి దూరంగా ఉన్నారు. అంతెందుకు జర్నలిస్టులకే కలిసే అవకాశం లేదు. మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి, వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడుల జమానాల్లోనూ ఇంతటి దౌర్భాగ్యం పట్టలేదు. జర్నలిస్టులకు వైఎస్ హయాంలో ఇచ్చిన భూమిని బదలాయించాలని సుప్రీం తీర్పు ఇచ్చినా బుట్టదాఖలు చేసిన నిరంకుశ విధానాలను మర్చిపోలేం. అభివృద్ధి గురించి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు..గతంలో బ్రిటిషర్లు, నిజాంలు కూడా అభివృద్ధి చేశారు. కానీ వారిని తరిమికొట్టిన చరిత్ర ఈ దేశానిది. తెలంగాణలో ఆత్మగౌరవం దెబ్బతింటే తిరుగుబాటు చేసిన చరిత్ర ఉంది. నిజాం నిరంకుశంపై అంకుశం దింపారు. ఇది కెసిఆర్ గుర్తించినట్లు లేదు. తెలంగాణ వస్తే నిజంగా ఒక బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతుందని ప్రజలంతా ఆశపడ్డారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. గోబెల్స్ ప్రచారాన్ని మించి ప్రచారా ల్లో కెసిఆర్, ఆయన వందిమాగధులు అబద్దాలను ప్రచారం చేస్తూ వచ్చారు. గత తొమ్మిదిన్నరేళ్ళుగా రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం సామాన్య ప్రజలకు మేలు చేయడంలో విఫలమయ్యింది. అబద్దాల పునాదుల మీద పరిపాలన చేపట్టారు. నిజాలు ప్రజలకు తెలియకుండా సచివాలయానికి, ప్రగతిభవన్‌కు జర్నలిస్టులను, ప్రజలను, ఎన్నికైన ప్రజాప్రతనిధులను దూరం పెట్టారు. అన్నింటికి మించి రాష్ట్రంలో అవినీతి, కుటుంబ పాలన, అబద్దాల హోరు మార్మోగింది. ఎమ్మెల్యేలు అందినకాడికి దోచుకుంటున్నారు. ఇసుకు, మట్టి, గ్రానైట్ వంటి దోపిడీలకు లెక్కలేకుండా పోయింది. రాష్ట్రంలో అసమర్థత, అప్రజాస్వామిక, అహంకారపూరిత పరిపాలన తాండవిస్తోంది. కేసీఆర్ ఆడినన్ని అబద్దాలు దేశంలో ఏ రాజకీయ నాయకుడు ఆడి వుండడు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తా లేకపోతే నా తల నరుక్కుంటాను అనే ఒక పెద్ద అబద్ధంతో మొదలుపెట్టి, ఇంటికొక ఉద్యోగం, పేదలందరికి డబుల్ బెడ్రూం ఇండ్లు, కేజీ టూ పీజీ, దళితులకు మూడు ఎకరాలు, అంటూ పదేపదే అబద్దాలను ప్రచారం చేసుకున్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రం అంటూ అప్పుల కుప్పగా మార్చారు. వందల సంఖ్యలో పాఠశాలలను మూసేశారు. కెజి టూ పిజి ఉచిత విద్య అంటూ ప్రగల్భాలు పలికారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను కేసీఆర్ ప్రణాళిక ప్రకారం ధ్వంసం చేసి, ప్రేవేట్ విద్యకు పెద్దపీట వేశారు. ప్రైవేట్ ఫీజుల దోపిడీపై తల్లిదండ్రులు ఆందోళన చేపడితే కనీసం జవాబు లేదు. ఫీజుల మోతలు తగ్గలేదు. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం ప్రభుత్వ విద్యా నాణ్యతలో దేశంలో తెలంగాణ చివరి స్థానంలో ఉంది. రాష్ట్రంలో పాఠశాల విద్యను పనిగట్టుకుని నిర్వీర్యం చేశారు. మరుగుదొడ్లు లేని బడులు తెలంగాణలోనే అత్యధికంగా ఉండడం తెలంగాణలో విధ్వంసానికి గురైన విద్య పరిస్థితికి కొన్ని ఉదాహరణలుగా చూడాలి. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో సగటున 74శాతం బోధన అధ్యాపకుల ఖాళీలు ఉండడం, కేసీఆర్ గత 9 ఏళ్లలో ఒక్కసారికూడ విద్యావ్యవస్థకు సంబంధిత రివ్యూ మీటింగు పెట్టకపోవడం గమనించవచ్చు. సంవత్సరాల తరబడి వైస్ చాన్సలర్లను నియమించకపోవడాన్ని బట్టి కూడా ఆయన వైఖరి అర్థం చేసుకోవచ్చు. పేదలు పేదలుగానే ఉండాలి, మధ్యతరగతి వాళ్ళు ప్రైవేటు బడులకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు వెళ్ళి చదువుకోవాలని ఉద్దేశ్యంతో పాలన సాగింది. విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోలేదు. ప్రైవేట్ యాజామాన్యాలపై అజమాయిషీ అనేది లేకుండా పోయింది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులను పట్టించుకోక పోవడం, ఊరికో దవాఖానా అంటూ ఊదరగొట్టడం చూశాం. నిజానికి మనం ఎన్ని ప్రచారాలు చేసినా క్షేత్రస్థాయిలో ప్రజలకు నిజాలు తెలిసి పోతాయన్న ఇంగితం కూడా పాటించలేదు. విద్యావైద్యరంగాలను భ్రష్టు పట్టించడమే కాకుండా బ్రహ్మాండంగా చేశామంటూ ఊదరగొట్టారు. 1200 మంది యువత ఆత్మ బలిదానం చేసుకుని తెలంగాణ సాధనకు కారణమైతే వారినే విస్మరించిన తీరు యువతలో ఆగ్రహావేశాలకు కారణమయ్యింది.సచివాలయం, ప్రగతిభవన్, అంబద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారకం అంటూ హడావిడి చేసిన ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పట్టించుకోలేదు. 2015లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును మూడేళ్ళల్లో పూర్తి చేస్తా అని ఇప్పటివరకు రూ.2600 కోట్లు ఖర్చుపెట్టి ఇంకా పూర్తి చేయలేదు. మేడిగ్గ దెబ్బతిన్నా పట్టింపు లేదు. దళితబంధు అని మూడేళ్ళల్లో రెండు శాతం కుటుంబాలకు ఇచ్చి ఎమ్మెల్యేల అవినీతికి తెరలేపారు. రైతుబంధు పేరుతో పెత్తందారీలకు, భూకామందులకు రైతులు కాని రైతులకు, వ్యాపారస్థులు, విదేశాలలో స్థిరపడ్డ శ్రీమంతులకు ఉన్న భూములకు అడగకుండానే కొన్ని వేలకోట్ల రూపాయలను రైతుబంధు క్రింద దానం చేస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. ఇది ప్రజల సొమ్మును దుబారా చేయడం తప్ప మరోటి కాదు. దీనిపై ఎలాంటి సమీక్ష లేదు. రూపాయికి కిలోబియ్యం దుబారాపైనా సమీక్ష లేదు. కిరణ్ కుమార్ రెడ్డిని నిత్యం విమర్శిస్తున్న కెసిఆర్ ఆయన పెట్టిన రూపాయి బియ్యాన్ని మాత్రం పట్టుకుని వేలాడు తున్నారు. ఇలాంటి విషయాలన్నీ ఇప్పుడు ప్రజలు చర్చిస్తున్నారు. రైతుబంధు దుబారాపై చర్చిస్తున్నారు. నిరంతర కరెంట్ పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రశ్నిస్తున్నారు. ఇవన్నీ కూడా బిఆర్ఎస్ ఎక్కడా చర్చించలేదు. ఈ క్రమంలో ప్రజలు రేపటి ఎన్నికల్లో ఎలా స్పందిస్తారన్నది చూడాలి.

# తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

## రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్ వెల్లడి



హైదరాబాద్, నవంబర్ 28 **(సమ సమాజం):** తెలంగాణలో కాంగ్రెస్ అధికారం ఏర్పాటు చేయబోతున్నది రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రానుందన్నారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఉంటే మిజోరం ఎందుకు వెళ్ళలేదని బీజేపీ అగ్రనేతలను ఉద్దేశించి అశోక్ గెహ్లాట్ అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో సర్కార్ ఆటోమోడ్‌లో నడుస్తోందన్నారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు బాగున్నాయని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని తెలిసి బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోయాయన్నారు. రాజస్థాన్ లో పేపర్ లీకు కేసులో బాధ్యులపై కఠినంగా వ్యవహరించామన్నారు. ఎన్నికల్లో గెలవడానికి ఈడీని బీజేపీ ప్రయోగిస్తోందని అన్నారు. అవినీతిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని అశోక్ గెహ్లాట్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం తీరుపై ప్రజల్లో స్పష్టమైన వ్యతిరేకత కానవస్తోందని అన్నారు.

# దళితులకు మూడెకరాల హామీకి గండి

## పేదల వద్ద భూములుంటే తట్టుకోలేరు

### గజ్వేల్ సభలో కెసిఆర్‌పై ఈటెల తూటాలు



సిద్దిపేట,నవంబర్28**(సమ సమాజం):** దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానన్న కేసీఆర్ ఆ భూమి ఇవ్వకపోగా ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను లాక్కున్నారని బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. పేదలు, దళితులు భూములు కలిగి ఉండడం సహించలేకపోతున్నారని అన్నారు. కోట్ల విలువైన భూములు వారివద్ద ఉండడాన్ని తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి మాట్లాడుతూ.. పేద వాళ్ళను కొట్టి పెద్ద వాళ్లకు పెడుతున్నారని ఆరోపించారు. కొండపాక కలెక్టర్ కార్యాలయం నిమిత్తం 25 ఎకరాల భూమి అవసరం అయితే 350 ఎకరాల భూమిని తీసుకొని మిగతా భూమిని ఎ÷-లాట్లుగా చేసి అమ్ముకున్నారన్నారు. పేద వాళ్లకు కోట్ల విలువ చేసే భూములు ఉండకూడదనే కేసీఆర్ ఉద్దేశమన్నారు. మాదిగ ఉపకులాల వర్గీకరణ కావాలని 30 ఏళ్లుగా పోరాడిందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు మాదిగవర్గీకరణ చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధిని కూడా తమ ఖాతాలలో వేసుకున్న పరిస్థితి కేసీఆర్ దని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కండువా వేసుకోకపోతే వాళ్లకు ఓటు వేయకపోతే తెలంగాణ గడ్డమీద బ్రతకనివ్వమని, కేసులు పెడతామని బెదిరించే పరిస్థితి ఏర్పడిందన్నారు. చొప్పదొండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుడిగే శోభ ఇంట్లో అక్రమ తనిఖీలు చేసిన పోలీసుల వైఖరిని ఖండిస్తున్నామన్నారు. పోలీసులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు

## ప్రలోభాలపై దృష్టి సారించాలి




మద్యం, నగదు పంపిణీలపై ప్రత్యేక ఫోకస్● ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు
రాష్ట్ర ఎన్నికల నిర్వహణపై కేంద్రం సమీక్ష● పలు సూచనలు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ/హైదరాబాద్,నవంబర్28**(సమ సమాజం):** ఎన్నికల నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రలోభాలపై దృష్టి సారించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.మద్యం, నగదు కట్టడిలో చివరి రెండు రోజులు కీలకమని సీఈసీ తెలిపింది. మావోయిస్టు,సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈసీఐ సూచించింది. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల అధికారి, ఇతర అధికారులతో సమీక్షించింది. ఈ కాన్ఫరెన్స్‌కు లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, నోడల్ ఆఫీసర్ చీఫ్ మహేష్ భగవత్, జిల్లా ఎన్నికల అధికారులు, సీపీలు, ఎస్పీలు హాజరయ్యారు. సీఈఓ వికాస్ రాజ్, ఆయన బృందం కూడా పాల్గొంది. మంగళవారం సాయంత్రం ప్రచార పర్వం ముగియనుండడంతో తీసుకోవాల్సిన చర్యలపై ఇసి సూచనలు చేసింది. 35వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ,3లక్షల మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. 13 జిల్లాల్లో సాయంత్రం 4 గంటలకు ప్రచార గడువు ముగియనుంది. పోలింగ్ టైం ముగియగానే సెగ్మెంట్లు ఖాళీ చేయాలని స్థానికేత రులకు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. 119 అసెంబ్లీ కేంద్రాలు – 2290 అభ్యర్థులు, ఒకేదశలో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 60వేల బ్యాలెట్ యూనిట్లు, అదనంగా మరో 14వేలు ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 30వ తేదీ పోలింగ్ నిర్వహించి, డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి గడువు ముగియడంతో అభ్యంతరకర, రాజకీయపరమైన, బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రసారంపై ఎన్నికల అధికారులు నిషేధం విధించారు. వీటి ప్రసారాలపై నిశితంగా పర్యవేక్షించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు 48 గంటల ముందు నుంచే రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌ల ప్రసారాలను కేంద్ర ఎన్నికల కమిషన్ నిలిపివేయాలని ఆదేశించినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలను ఉల్లంఘించేలా ఎస్ఎంఎస్‌లు పంపరాదని సూచించారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే విచారణ జరిపి భారత శిక్షాస్మృతి ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఎంఎస్‌లు పంపేందుకు అయ్యే ఖర్చును కూడా పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. మరోవైపు పోలింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ మొదలవనుంది. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ కోలాహలం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ స్లిప్పుల పంపిణీ కొనసాగుతోంది. ఓటర్ స్లిప్పుతోపాటు ఓటరు గుర్తింపు కార్డ్ తీసుకెళ్లి ఓటర్లు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. అయితే కారణాలు ఏమైనా కొంతమంది వద్ద ఓటరు ఐడీ కార్డులు లేకపోవచ్చు. అలాంటి వారు కూడా నిస్సందేహంగా ఓటు వేయవచ్చు. అయితే పోలింగ్ బూత్‌కు ప్రభుత్వ ఆమోదం ఉన్న 14గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి దానిని పోలింగ్ బూత్‌కి తీసుకెళ్తే సరిపోతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమరం చివరి అంకానికి చేరుకుంది. నవంబర్ 30న 119 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఓటింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల ఉత్కంఠ పెరుగుతోంది. తమ ప్రాంతంలో వీలైనంత ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొనేలా పార్టీ కార్యకర్తలు కృషి చేస్తున్నారు. ఎన్నికల సంఘం కూడా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. 2018లో మొత్తం 2,56,94,443 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,04,70,749 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం రాష్ట్రంలో 79.7 శాతం ఓటింగ్ నమోదైంది. 2018లో అత్యధిక, అత్యల్ప ఓటింగ్ జరిగిన మూడు అసెంబ్లీ స్థానాలు ప్రాధాన్యం సంతరించుకుంది. 2018లో తెలంగాణలోని పాలేరు అసెంబ్లీ స్థానంలో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. ఇక్కడ ఓటింగ్ శాతం 92.1 శాతం నమోదైనట్లుగా ఈసీ లెక్కలు చెబుతున్నాయి. ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,08,659 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో మొత్తం 1,92,164 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018లో మధిర అసెంబ్లీ స్థానంలో 92.0 శాతం ఓటింగ్ జరిగింది. ఇక్కడ మొత్తం 2,03,240 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 1,86,943 మంది ఓటు వేశారు. అలేర్ నియోజకవర్గంలో 91.5 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 2,09,345 మంది ఓటర్లు ఉండగా.. 1,91,481 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. మలక్‌పేట అసెంబ్లీ స్థానంలో 42.4 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ నమోదైన ఓటర్ల సంఖ్య 2,93,487 కాగా.. కేవలం 1,24,315 మంది మాత్రమే ఓటు వేశారు. యాకుత్‌పురా అసెంబ్లీ స్థానంలో 42.5 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ స్థానంలో నమోదైన ఓటర్లు 3,33,577 కాగా.. కేవలం 1,41,839 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. నాంపల్లి నియోజకవర్గంలో 45.5 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం ఓటర్లు 3,03,521 కాగా, 1,37,972 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# దళితుల నిధులను పక్కదారి పట్టించిన జగన్



దళితుల సంక్షేమ పథకాల రద్దు
ఆక్వారైతులకు న్యాయం చేస్తాం
యువగళం పాయాత్రలో లోకేశ్ వెల్లడి

**అంబేద్కర్ కోనసీమ, నవంబర్ 28 (సమ సమాజం):** తన ఎస్సీలు, బీసీలు అంటున్న జగన్మోహన్రెడ్డి ఆయా వర్గాలకు తీరని అన్యాయం చేస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు. దళితులకు చెందాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేయడమేగాక, రూ.28,147 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించిన దళిత ద్రోహి జగన్ అని ఆరోపించారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ యువనేత నారా లోకేష్ విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమకు జరిగిన అన్యాయాలను ప్రశ్నించిన దళితులను జగన్ సర్కారు అణచివేసిందని విమర్శించారు. అమలాపురంలో యువగళం పాదయాత్రకు జనం నీరాజనం పలుకుతున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని చూసేందుకు ప్రజలు భారీగా రోడ్లపైకి వచ్చారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న భవనాల పైకి ఎక్కి లోకేష్‌కి జనం అభివాదం చేస్తున్నారు. మహిళలు, యువత, వృద్ధులను కలుస్తూ వారి సమస్యలను నారా లోకేష్ తెలుసుకుంటున్నారు. విద్యుత్ ఛార్జీల బాదుడు తట్టుకోలేకపోతున్నామని.. లోకేష్ వద్ద మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, ఇంటి పన్ను, చెత్త పన్ను అంటూ ప్రభుత్వం సామాన్యుడిపై పెను భారం మోపిందని నారా లోకేష్ పేర్కొన్నారు. పెరిగిన ఖర్చులతో బతకడం కష్టంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా పై భారం తగ్గించాలని లోకేష్‌ను మహిళలు కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తామని లోకేష్ తెలిపారు. జగన్ 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచేశాడని... బిల్లు పట్టుకుంటే షాక్ కొడుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పన్నుల భారం తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. మంగళవారం ఉదయం పేరూరు క్యాంప్ సైట్ నుంచి లోకేష్ పాదయాత్రనుప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్‌ను కోనసీమజిల్లా ఆక్వా రైతులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తామని యువనేత హామీ ఇచ్చారు. జగన్ పాలనలో ఆక్వా హాలిడే ప్రకటించే దారుణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీడ్, ఫీడ్, విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచి ఆక్వా రైతులను జగన్ ప్రభుత్వం కోలుకోలేని దెబ్బతీసిందని యువనేత ఆగ్రహం వ్యక్తం చేశారు. ÷ూష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచకపాలనలో ఆక్వారంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. టీడీపీ (÷ుఆఖ) పాలనలో ఆక్వారంగాన్ని దేశంలోనే మొదటిస్థానంలో నిలిపామని చెప్పుకొచ్చారు. ఆక్వా రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సీడీకి జోన్ల విధానం అమలు చేయడం ద్వారా భారీ రేట్లు వసూలు చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాకా ఆక్వారంగాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జోన్లతో సంబంధం లేకుండా ఆక్వా రైతాంగానికి యూనిట్ 1.50 కే విద్యుత్ అందిస్తామని వెల్లడించారు. ఫీడ్, సీడ్, విద్యుత్ ధరలను తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వా పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని లోకేష్ పేర్కొన్నారు.

# రెండ్రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు



**(మొదటి పేజి తరువాయి)** నేపథ్యంలో ఎన్నికల అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతను పెంచారు. సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగియనుండగా.. నేటి నుంచి 3 రోజులపాటు మద్యం దుకాణాలు మూసివేసారు. పోలింగ్ ముగిసే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలు క్లోజ్ కానున్నాయి. వైన్స్, బార్లు మూసివేయాలని ఇప్పటికే ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్‌కు రెండ్రోజల మందు నుంచే మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆదేశాలు ఉల్లంఘించి మద్యం దుకాణాలు తెరిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే భారీగా మద్యం, డబ్బులు నియోజక వర్గాలకు చేరినట్లు తెలిసింది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం,నగదులను కూడా సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

# రాష్ట్రస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
శాస్త్ర సాంకేతిక మండలి మెంబెర్ సెక్రటరీ డా. వై. అపర్ణ.

విజయవాడ,నవంబర్28(సమ సమాజం): రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ – 2023 ఈ నెల 29, 30వ తేదీలలో కె.ఎల్. యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (అప్ కాస్ట్) మెంబెర్ సెక్రటరీ డా. వై. అపర్ణ తెలిపారు. విజయవాడ భవానీపురం లోని అప్ కాస్ట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ పిల్లలు హేతుబద్దంగా ఉండటానికి పరిశోధనలు అర్థం చేసుకోవడానికి పరిసరాలలోని స్థానిక సమస్యలను పరిష్కరించడానికి, పరిష్కారాలను వెతకడానికి శాస్త్రీయ పద్ధతులను వర్తింప చేయడానికి బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అనుమతితో రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరం లోని కె.ఎల్. డీమ్డ్ టూ బి యూనివర్సిటీలో ఈ నెల 29, 30వ తేదీలలో నిర్వహించే 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ లో రాష్ట్ర నలుమూలల నుండి బాల శాస్త్ర వేత్తలు, గైడ్స్, ఎస్కార్ట్ టీచర్ లు, జిల్లా కో ఆర్డినేటర్లు, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ లతో సహా మొత్తం 500 మంది పాల్గొంటున్నారని ఆమె తెలిపారు. విచారణ – ఆధారిత అబ్యాస కార్యక్రమాలు ప్రతీ సంవత్సరం ఒక నిర్దిష్ట ఫోకల్ థీమ్ పై నిర్వహించబడుతుందని దీనిలో భాగంగా ’ లోకల్ ఫర్ గ్లోబల్ ’ అనే ప్రాథమిక సూత్రం పై నిర్ణయించబడుతుందన్నారు. కోవిడ్ మహమ్మారి అనంతరం వచ్చిన పరిస్థితుల్లో మానవ శ్రేయస్సు, జీవ వైవిధ్య పరిరక్షణ మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో దాని నిబద్ధతను పరిగణలోనికి తీసుకుంటారన్నారు. విద్యార్థులకు అవగాహన కొరకు 5 ఉప అంశాలుగా విభజించామన్నారు. (1) మీ పర్యావరణ వ్యవస్థను గురించి తెలుసుకోవడం (2) ఆరోగ్యం – పోషణ మరియు సంక్షేమం పెంపొందించడం (3) పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యం కోసం సామజిక మరియు సాంస్కృతిక పద్ధతులు (4) స్వీయ – విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం (5) పర్యావరణ వ్యవస్థ మరియు ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ. జిల్లా స్థాయిలో బాల శాస్త్రవేత్తలచే 4000 వేల ప్రాజెక్ట్ లను తయారు చేసి ప్రదర్శించారని తుదిగా 26 జిల్లాల నుండి 182 ప్రాజెక్ట్ లను ఈ రాష్ట్ర స్థాయి ఈవెంట్ లో ప్రదర్శన కోసం ఎంపిక చేయబడ్డాయని తెలిపారు. మన రాష్ట్ర కోటా ప్రకారం 17 ప్రాజెక్ట్ లను జాతీయ స్థాయిలో పాల్గొనే ఈవెంట్ కు ఎంపిక చేయబడతామని ప్రతీ జిల్లా నుండి ఒక ప్రాజెక్ట్ ను ఎంపిక చేసి కెవిఆర్ సైంటిఫిక్ సొసైటీ వారి ఎవాల్యూయేషన్ కోసం పంపడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ విన్నర్ గా ఎంపికైన ఎస్. లావణ్యను గుర్తు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉన్నదని, అలాగే మంచి ప్రతిభతో గ్రేడ్ సాధించింది.

# దొరల తెలంగాణ కావాలో.... ప్రజల తెలంగాణ కావాలో....



జహీరాబాద్‌లో పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్‌కు మద్దతుగా నిర్వహించిన కాంగ్రెస్ రోడ్ షోలో అగ్రనేత ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ రోడ్‌షోకు భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. జహీరాబాద్‌లో కార్నర్ మీటింగ్‌లో ప్రియాంక ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పాటకు ప్రియాంక గాంధీ స్టెప్పులేసి అందరినీ ఉత్సాహపరిచారు. అక్రమాలతో దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ధనిక పార్టీలుగా మారాయన్నారు. రూ.16 వేల కోట్లతో విమానాలు, అదాని రుణాలు మాఫీ చేసే మోడీకి పేదల రుణాల మాఫీ గుర్తుకు రాదని విమర్శించారు. కరోనా సమయంలో దేశ ప్రజలు అల్లాడితే మోడీ ఆదుకోవడంలో విఫలం అయ్యారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు అమలు చేస్తామని అన్నారు. రెండు లక్షల వరకు ఏకకాలంలో రైతుల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌కు బై బై చెప్పే సమయం ఆసన్నం అయిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు చేశారు.

(మొదటి పేజి తరువాయి) ముఖ్యమంత్రి కేసీఆర్ అని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఓవైసీ పోటీ చేస్తారని.. తెలంగాణలో అన్నిచోట్ల ఎందుకు పోటీ చేయరని ప్రశ్నించారు. జిల్లాలోని

## గెలిస్తే విజయయాత్ర..లేదంటే శవయాత్ర



(మొదటి పేజి తరువాయి) చేసుకోవడమో రెండే మార్గాలని అభిప్రాయపడ్డారు. ప్రచారం చేసిన ప్రాంతంలోనే తమ శవాలు కనిపిస్తాయన్నారు. ప్రజలు ఓటు వేస్తే డిసెంబర్ 3 విజయాత్రకు వస్తానని... లేకుంటే డిసెంబర్ 4న తన శవయాత్రకు ప్రజలు రావాలి అన్నారు కౌశిక్ రెడ్డి. కారు గుర్తుపై పోటీ చేస్తున్న తనకు ఒక్క అవకాశం ఇస్తే తన తల ప్రజల కడుపులో పెట్టుకుంటానని హుజురాబాద్‌ను కాపాడుకుంటానని అభివృద్ధి చేస్తానని అన్నారు. మాజీ మంత్రి ఈటలపై కౌశిక్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈటల రాజేందర్ బీజేపీ తరఫున నిలబడ్డారు. గత ఎన్నికల సమయంలో ఈటల కారు గుర్తుపై పోటీ చేశారు. విజయం సాధించి మంత్రిగా కూడా పని చేశారు. కేసీఆర్‌తో విభేదాలు కారణంగా పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. చివరకు ఆయన తన పదవులన్నింటికీ రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లారు. అప్పటి వరకు కాంగ్రెస్‌లో ఉన్న కౌశిక్ రెడ్డి కారు ఎక్కారు. టికెట్ ఆశించారు. కానీ ఈటలపై గెల్లు శ్రీనివాస్‌ను పోటీకి దింపారు కేసీఆర్. ఆ ఎన్నికల్లో ఈటల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి అదే రిపీట్ చేయాలని చూస్తున్నారు. ఈసారి ఈటల రాజేందర్ కేసీఆర్‌పై గజ్వేల్‌లో కూడా పోటీ చేస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన గడ్డ సిద్దిపేట



(మొదటి పేజి తరువాయి) కోసం ఎన్నో ఇబ్బందులు పడిన గజ్వేల్‌కు ప్రాజెక్టులు, కాలువలు రావడంతో ఆ బాధ కూడా తీరిపోయింది' అని సీఎం అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గాన్ని పొగడ్తల్లో ముంచెత్తారు. గజ్వేల్ నియోజక వర్గంపై తనకు ఉన్న అభిమానాన్ని, మమకారాన్ని చాటుకున్నారు. గజ్వేల్ తన గౌరవాన్ని పెంచిందని, తనను ఈ స్థాయికి తెచ్చిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గజ్వేల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. 'మన గజ్వేల్‌కు రైలు వస్తదని ఎన్నడూ అనుకోలేదు, కానీ రైలు కూడా వచ్చేసింది. గజ్వేల్ ఒక గుర్తింపు కలిగిన నియోజకవర్గంగా ఎదిగింది. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి గజ్వేల్ మోడల్ అభివృద్ధిని చూడటానికి వస్తున్నరు. మన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కావచ్చు, మన అడవుల పునరుద్ధరణ కావచ్చు, మన మల్లన్నసాగర్ ప్రాజెక్టు కావచ్చు.. ఇట్ల అనేక రకాల పనులను చూడటానికి ఇయ్యాల గజ్వేల్‌కు వస్తున్నరు. మిషన్ భగీరథ పథకాన్ని గురించి తెలుసుకోవడానికి కోమటిబండకు రాని రాష్ట్రమే భారత దేశంలో లేదు. అన్నింటికంటే ముఖ్యంగా ఇప్పుడు మనం తాగుతు న్నది, సాగుకు వినియోగిస్తున్నది మనందరం ఎంతో పవిత్రంగా భావించే గోదావరి జలాలు. ఇలా ఒక రోల్ మోడల్‌గా గజ్వేల్ ఎదిగింది. అయితే ఇప్పటికే అయ్యింది చాలా గొప్ప అని మనం సంతోషపడితే కాదు, ఇంకా చాలా అభివృద్ధి కావాల్సి ఉందని సీఎం చెప్పారు. గత 24 ఏండ్లుగా తెలంగాణ ఆశగా, శ్వాసగా బతుకుతున్నానని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. గజ్వేల్ నుంచి మీరు అవకాశం ఇచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి పంపిస్తే ఈ రాష్ట్రం కోసం కష్టపడ్డాను, కృషి చేశాను. అవన్నీ ప్రజల కండ్ల ముందు కనబడుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు. ఈ నియోజకవర్గం నుంచి కేసీఆర్ పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఇది నా చివరి సభ.. ఇది 96వ సభ. తెలంగాణ రాష్ట్రం గురించి కూడా ఒకసారి చెప్పాలి. గజ్వేల్ నుంచి మీరు అవకాశం ఇచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి పంపిస్తే ఈ రాష్ట్రం కోసం కష్టపడ్డాను. కృషి చేశాను. అవన్నీ ప్రజల కండ్ల ముందు కనబడుతున్నాయి. ఇక్కడ వచ్చేటటువంటి ట్రిపుల్ ఆర్ కూడా మన గజ్వేల్ మీదుగానే రాబోతుందని సంతోషంగా తెలియజేస్తున్నా. 24 ఏండ్లుగా తెలంగాణనే ఆశగా, శ్వాసగా బతుకుతున్నాను. ఆ విషయం మీ అందరికి తెలుసు అని కేసీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ సందర్భంలో తెలంగాదణ ఎట్ల తేవాలని ఆరాట పడ్డాను. పోరాటం చేశాను. కాంగ్రెస్ పార్టీ మోసం చేసినా తట్టుకోని, నిలబడి, మొండిగా, చివరకి మళ్లీ ధోకా చేశారని గుర్తించి, ఇక తప్పదనే నమ్మకానికి వచ్చి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష చేస్తే, 33 పార్టీలు మనకు అండగా వస్తే అప్పుడు దిగొచ్చింది ఈ కాంగ్రెస్ పార్టీ. ఇవాళ కాంగ్రెస్ పార్టీ అనేక విషయాలు మాట్లాడుతోంది. మేం గెలిస్తే మళ్ల ఇందిరమ్మ రాజ్యం తెస్తమని చెబుతున్నారు. ఇందిరమ్మ రాజ్యం ఎవరికి కావాలి ఇప్పుడు. అసలు నాకర్థం కాదు. ఇందిరమ్మ రాజ్యం సక్కగా ఉంటే ఎన్టీ రామారావు పార్టీ పెట్టి 2 రూపాయాలకే కిలో బియ్యం ఎందుకు ఇయ్యాల్సి వచ్చింది. అప్పటి వరకు మన రాష్ట్రం ఆకలి కడుపుతోనే ఉన్నది కదా..? ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ రోజులు వచ్చాయి. ఇందిరమ్మ రాజ్యంలోనే కదా ఎన్‌కౌంటర్లు, రక్తపాతం జరిగింది. మన తెలంగాణ ఉద్యమంలో 1969లో 400 మందిని కాల్చి చంపింది. ఇవన్నీ కావాలని మళ్లీ కోరుతున్నారు. ఇది ఎట్ల ఉందంటే తద్దినం ఉందని భోజనానికి పిలిస్తే రోజు మీ ఇంట్లో ఇట్లనే జరగాలని అన్నడట యెన్కటికి ఒకడు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ గెలిచేది లేదు సచ్చేది లేదు. కానీ గెలిస్తే మటుకు ఇందిరమ్మ రాజ్యం తెస్తమని మాట్లాడుతున్నారు అని కేసీఆర్ ధ్వజమెత్తారు. బిజెపి ఒక్కటంటే ఒక్క పనిచేయని దానికి ఎందుకు ఓటేయాలని అన్నారు. బిజెపికి ఓటేసి తప్పు చేయొద్దన్నారు.

## సోనియమ్మగా గౌరవించి ఆదరించారు

### మీకెప్పుడూ రుణపడి ఉంటాను

### కాంగ్రెస్‌ను గెలపించాలంటూ సోనియా వీడియో సందేశం

**న్యూఢిల్లీ,నవంబర్28(సమ సమాజం):** తనను సోనియమ్మ అని పిలిచి తెలంగాణ ప్రజలు తనకు చాలా గౌరవం ఇచ్చారని, ఈ ప్రేమ, అభిమానాలకు తాను ఎప్పటికి మీకు రుణపడి ఉంటానని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అన్నారు. తెలంగాణ సోదరులు, అమ్మలు, బిడ్డలకు తన విన్నపాన్ని తెలియజేశారు. మార్పు కోసం కాంగ్రెస్ కి ఓటేయాలని పిలుపు ఇచ్చారు. మీకు నిజమైన, నిజాయితీ గల ప్రభుత్వాన్ని, పాలనను అందించడానికి మేం సిద్ధంగా ఉన్నామని అన్నారు. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అని అన్నారు. ఎప్పటికీ మీకు అంకితమై ఉంటానని అన్నారు. నమస్కారం నా సోదరీమణులు మరియు ప్రియమైన తెలంగాణ సోదరులారా, నేను మీ అందరి మధ్యకు రాలేకపోయాను కానీ మీ హృదయాలకు చాలా దగ్గరయ్యాను. ఈ రోజు నేను మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. తెలంగాణ తల్లి.. అమరుల పుత్రుల కల నెరవేరేలా చూడాలని అన్నారు. మనం అందరం దొరల తెలంగాణను ప్రజా తెలంగాణగా మార్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీ కలలను నిజం చేసుకోండి. మీకు నిజమైన, నిజాయితీ గల ప్రభుత్వాన్ని, పాలనను అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాము. మీరు నన్ను సోనియమ్మా అని పిలిచి అపారమైన గౌరవం, అప్యాయత ఇచ్చారు. నన్ను తల్లిలా చూసుకున్నారు. ఈ ప్రేమ, గౌరవానికి నేను ఎల్లప్పుడూ మీకు కృతజ్ఞతగా ఉంటాను. ఎప్పటికీ మీకు అంకితమై ఉంటాను. తెలంగాణలోని మన సోదరీమణులు, తల్లులు, కొడుకులు, కుమార్తెలు, సోదరులు ఈసారి తమ శక్తినంతా వినియోగించి మార్పు తీసుకురావాలని అభ్యర్థిస్తున్నాను. కాంగ్రెస్‌కు ఓటు వేయండని సోనియా గాంధీ ఓ వీడియోను విడుదల చేశారు.

# యువ ఓటర్లపైనే బిజెపి ప్రధాన దృష్టి

(మొదటి పేజి తరువాయి) సహా అనేకులు తెలంగాణ ప్రచారంలో అదరగొట్టారు. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా ఇంకా కొనసాగుతున్నందన ఆయన అటు కేంద్రంలోనూ..ఇటు రాష్ట్రంలోనూ దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఇదే క్రమంలో తెలంగాణలో పార్టీ పటిష్టతపైనా పెద్దలతో చర్చిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో ఓట్ల వేసేది ఎక్కువగా యువతేనని బీజేపీ భావించి అందుకు తగ్గట్లుగా ప్రచారం చేసింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై హామీలు గుప్పించింది. సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా ఓటర్లలో యువ ఓటర్ల సంఖ్యనే ఎక్కువ. తెలంగాణలో మొత్తం 3కోట్ల 03లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి ఓటరు ఎన్‌రోలింగ్ జాబితాలో దాదాపు 4లక్షల మంది 18-19 సంవత్సరాల వయసు ఉన్న కొత్త ఓటర్లు చేరుతున్నారు. మొత్తం ఓటర్లలో యువ ఓటర్ల సంఖ్య కోటికిపైనే ఉంటుందని, ప్రతీ ఎంపీ , అసెంబ్లి సెగ్మెంట్‌లో వీరి ఓట్లు గెలుపోటములను నిర్ణయిస్తాయని బీజేపీ అంచనా వేస్తోంది.అందుకే యువత ఓట్లను పొందాలంటే జాతీయవాద అంశాలపై వరుస కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ నిర్ణయించి అలాగే అనుసరించింది. తెలంగాణ అసెంబ్లీలో చాపకింద నీరులా విస్తరించి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. జాతీయవాద అంశాలతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించిన మేరకు ప్రచారంలో వాటిని ముందుంచారు.. జాతీయవాద అంశాలను ప్రజల్లో మరీముఖ్యంగా యువతరాన్ని ఆకట్టుకునేవిధంగా ప్రస్తావిస్తూనే స్థానిక సమస్యలను కూడా లేవనెత్తారు. బిజెపి 370 ఆర్టికల్ రద్దు, అయోధ్య వంటి విషయాలను ప్రధాని మోడీ బాగా ప్రచారం చేశారు. జాతీయవాద అంశాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడం వెనక యువత ఓట్లను కొల్లగొట్టడమే కాషాయ పార్టీ ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. యువతను లక్ష్యంగా చేసుకుని వరుసగా జాతీయవాదాన్ని తట్టిలేపే కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. అమరవీరుల స్మరణార్థం దేశ వ్యాప్తంగా మేరా మిట్టి - మేరా దేశ్ కార్యక్రమంతోపాటు ఆగస్టు 14న భారతదేశ విభజనను నిరసిస్తూ దేశ విభజన గాయాల సంస్మరణ దిన్‌ను పెద్ద ఎత్తున నిర్వహించారు. అధిష్టానం ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి జిల్లాకు , ప్రతి అసెంబ్లి నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఇద్దరేసి కో.ఆర్డినేటర్లను నియమించి మట్టి సేకరణను చేపట్టింది. పోలింగ్ బూత్‌స్థాయిలో, మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో , రాష్ట్ర స్థాయిలో ప్రచార కార్యక్రమాలను ప్లాన్ చేసుకున్నారు. ఇవన్నీ ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాలి.

## తెలంగాణలో మైనార్టీల సంక్షేమానికి కృషి

(మొదటి పేజి తరువాయి)



నేతలతో కలిసి మంత్రి మహమూద్ అలీ మీడియాతో మాట్లాడారు. పేద విద్యార్థులకు కూడా విదేశీ విద్య అందిస్తున్నామన్నారు. 3 వేల మంది విద్యార్థుల విదేశీ విద్యకు సహాయం చేశామని తెలిపారు. మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.20 లక్ష స్కాలర్‌షిప్ ఇస్తున్నామన్నారు. ముస్లింలలో వృత్తిదారులకు రూ.లక్ష మైనార్టీ బంధు సాయం అందిస్తున్నామని వెల్లడించారు. మైనార్టీల సంక్షేమానికి ఏడాదికి రూ.2,200 కోట్ల బ్జడెట్ కేటాయించామన్నారు. ఇది కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే అనేక రెట్లు ఎక్కవ బ్జడెట్ అన్నారు. అన్ని సంక్షేమ పథకాలు మైనార్టీలకు అందుతున్నాయని చెప్పారు. కులం, మతం చూడకుండా అన్నివర్గాలకు ఈ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని వెల్లడించారు. అన్ని మతాలవారి పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం



(మొదటి పేజి తరువాయి) అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. మార్పు తెలంగాణ నుంచే రాబోతున్నదని అన్నారు. తెలంగాణలో సంపూర్ణ మెజార్టీతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని అన్నారు. ఖమ్మం సాయి గణెశ్ నగర్‌లో పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీపీఐ నారాయణతో కలిసి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకిచ్చిన మాట సోనియా నిలబెట్టుకుని తెలంగాణ ఇచ్చారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది. దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో సహజ వనరులను దోచుకున్నారు. చివరకు ఆ కుటుంబం లిక్కర్‌ను కూడా వదిలిపెట్టలేదు. రాష్ట్రంలో ఉన్న సహజ సంపదనంతా దోచుకున్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా జిల్లా అభివృద్ధికి కృషి చేశాం. మీ అందరి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మేము రాబోయే రోజుల్లో నడుచుకుంటాం. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర ప్రజల విముక్తి కోసం పోరాడుతోందని, ఈ ఎన్నికలలో ఒక్క సీటు తీసుకుని 118 సీట్లలో సిపిఐ నేతలు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తున్నారని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణలో బెదిరింపులకు భయపడకుండా ప్రలోభాలకు లొంగకుండా నిజాలు నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తున్న మీడియా సంస్థలు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నరరూప రాక్షసుడి పాలన అంతమొందించాలని అన్ని పార్టీలు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపాయన్నారు. ఇక వార్ వన్ సైడ్ అని, కొత్తగూడెంలో సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంశివరావుతో సహ అందరు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం చిత్తశుద్ధితో కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేస్తున్నారు. ఆర్టీసీని అడ్డం పెట్టుకుని దుర్మార్గాలకు, దోపిడీకి పాల్పడ్డారని, ఆర్టీసీ కార్మికులు ఆందోళనలో ఉన్నారని, సింగరేణి కార్మికులను కంటికిరెప్పలా కాపాడుకుంటామని పొంగులేటి అన్నారు. రైతు బంధును అడ్డం పెట్టుకుని సీఎం కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారని, నోటిఫికేషన్‌కు ముందు ఎందుకు రైతు బంధు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. దుర్మార్గంగా కాంగ్రెస్ పార్టీపై బురదజల్లుతున్నారని, రైతు బంధు అడ్డుకున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు వ్యాఖ్యలవల్లే ఎలక్షన్ కమిషన్ రైతు బంధు నిలిపి వేసిందని, దీనికి హరీష్ రావే కారణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతన్నలను మోసం చేస్తోందని పొంగులేటి విమర్శించారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ నేత ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారని, డిసెంబర్ నెలాఖరులోగా రైతుల ఖాతాలలో నగదు జమచేస్తామని స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ మానస పుత్రికని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరుతుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. పాలేరు నియోజకవర్గంలో తనను ఓడించటానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని చేశారని, వందల కోట్ల అవినీతి సొమ్ము విచ్చలవిడిగా వెదజల్లుతున్నారన్నారు. పాలేరులో కేసీఆర్ ఆటలు సాగవని, తాను గెలవడం ఖాయమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు

## కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపుతా



(మొదటి పేజి తరువాయి) చేశారు. తమకు ప్రమాద బీమా కల్పించాలని డెలివరీ బాయ్స్ రాహుల్ గాంధీని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని రాహుల్ గాంధీ వారికి హామీ ఇచ్చారు.ఖైరతాబాద్‌లో కాంట్రాక్ట్ కార్మికులతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం ఉదయం భేటీ అయ్యారు. డ్రైవర్స్, డెలివరీ బాయ్స్, శానిటరీ వర్కర్లు, హెల్త్ వర్కర్లతో కాంగ్రెస్ అగ్రనేత ముఖాముఖి నిర్వహించారు. డెలివరీ బాయ్స్ తమ కష్టాలు మొరపెట్టుకున్నారు. రోజుకు ఎంత డబ్బు వస్తుందని రాహుల్ ఆరా తీశారు. తమకు టూ వీలర్స్ ఇప్పించాలని, పెట్రోల్ రేట్ తగ్గించాలని డెలివరీ బాయ్స్ కోరారు. అటు సానిటరీ వర్కర్లు, హెల్త్ వర్కర్లు కూడా తమ సమస్యలను రాహుల్ ముందు ఏకరుపెట్టారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎంత కష్టపడినా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల కొద్దీ పని చేసినా తగినంత వేతనం రావడం లేదని సానిటరీ వర్కర్లు చెప్పుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా పర్మినెంట్ చేయలేదని తెలిపారు. తమపై దయచూపి పర్మినెంట్ చేయాలని రాహుల్‌కు సానిటరీ వర్కర్లు వినతి చేశారు. తెలంగాణ సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని కాంట్రాక్ట్ వర్కర్లు వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ సమస్యలు తీర్చాలని రాహుల్ గాంధీని కోరారు. గత పదేళ్లుగా తమ సమస్యలు తీరడం లేదని క్యాబ్ డ్రైవర్లు తెలిపారు. సంక్షేమ ఫలాలు బీఆర్ఎస్ కార్యకర్తలకే అందుతున్నాయని అన్నారు. సంపాదించింది అంతా పెట్రోల్, డీజిల్‌కే పోతోందని.. చలానాలతో ట్రాఫిక్ పోలీసులు వేధిస్తున్నారని ఆటో డ్రైవర్లు వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మీ అందరి సమస్యలపై సీఎంతో మాట్లాడుతానని.. అన్నింటినీ పరిష్కరిస్తామని కాంట్రాక్ట్ కార్మికులకు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

# తెలంగాణలో ప్రచారానికి తెర



(మొదటి పేజి తరువాయి) ప్రచారం చేశారు. గల్లీలన్నీ ప్రచార రథాలతో, పార్టీల పాటలతో, నేతల ప్రసంగాలతో మారుమోగిపోగా.. ప్రచారం సమయం గంటలతో ముగిసిపోవటంతో.. ఒక్కసారిగా ప్రశాంతంగా మారిపోయాయి. పల్లెలు, పట్టణాల్లోని వాతావరణమంతా.. ఎడతెరపిలేకుండా కురిసిన జోరు వాన వెలిస్తే ఎలా ఉంటుందో అలా మారిపోయింది. ఇక ప్రచారానికి తెరపడటంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పర్వం కీలక ఘట్టానికి చేరుకుంది. నవంబర్ 30న జరుగనున్న పోలింగ్ కోసం ప్రతి ఒక్కరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పోలింగ్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేశారు. మరిన్ని ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అయిదుగురు మించి ఎక్కడైనా గుమిగూడితే చర్యలు తీసుకుంటారు. ఎన్నికలు ముగిసే వరకు వైన్ షాపులు, బార్లు మూసి ఉంచుతారు. లిక్కర్ అమ్మకాలపై నిషేధం విధించారు. 3 రోజుల పాటు మద్యం అమ్మకాలపై ఆంక్షలు ఉంటాయి. పోలింగ్ ముంగిట ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతుంటాయి కాబట్టి పోలీసులు డేగ కన్ను వేస్తారు. ఎన్నికల ఊరేగింపులు, ర్యాలీలు, సినిమాలు, టీవీల ద్వారా ప్రచారం నిర్వహించడం నిషిద్ధం. మొబైల్స్ ద్వారా ఎన్నికల సందేశాలను పంపించడం, ఒపీనియన్ సర్వేలు వెల్లడించడం నిషిద్ధం. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలు శిక్ష లేదా భారీ జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉంటుంది. అధికార ప్రతిపక్ష పార్టీలు ఈ నెల రోజులు జోరుగా ప్రచారం నిర్వహించాయి. బీఆర్ఎస్ పార్టీ అధినేత స్టార్ క్యాంపెయినర్‌గా రాష్ట్రమంతా కాళ్లకు చక్రాలు కట్టుకుని తిరిగినట్టుగానే చుట్టేశారు. రోజుకు నాలుగు సభల్లో పాల్గొంటూ.. గులాబీ జెండాను ఒంటి చేత్తో ప్రచారం చేశారు. ఆయన తర్వాత కేటీఆర్, హరీశ్ రావు కూడా రాష్ట్రమంతా తిరుగుతూ.. తమదైన మాటకారితనంతో.. ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. రెండు దఫాలుగా బీఆర్ఎస్ సర్కారు చేసిన పని తీరును చెప్తూ ప్రతిపక్షాలపై విమర్శలు సంధిస్తూ.. మూడో సారి అధికారంలోకి వచ్చేందుకు గట్టిగానే ప్రయత్నించారు. ఇక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా గట్టిగానే కృషి చేశాయి. రాష్ట్రంలోని ముఖ్య నేతలతో పాటు ఢిల్లీ అగ్రనేతలంతా తెలంగాణకు క్యూ కట్టారు. బీజేపీ తరఫున... ప్రధాని మోదీ దగ్గరి నుంచి మొదలుపెడితే కేంద్ర మంత్రులు, మిగతా రాష్ట్రాల సీఎంలు రాష్ట్రమంతా తిరుగుతూ.. కమలం పార్టీ ఎత్తుకున్న బీసీ మంత్రాన్ని గట్టిగానే పఠించారు. ఇక హస్తం నేతలు కూడా ఢిల్లీ నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి కూడా పెద్ద ఎత్తున క్యూ కట్టారు. రాహుల్, ప్రియాంకతో పాటు డీకే శివకుమార్ జోరుగా ప్రచారం చేశారు. మొత్తంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల తూటారు, విమర్శలు ప్రతివిమర్శలు, సవాళ్లు ప్రతిసవాళ్లతో పోటాపోటీగా ప్రచారం రసవత్తరంగా సాగింది. అయితే.. ఈ రాష్ట్రంలో పోటీ మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యలోనే గట్టిగా నెలకొననున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు అంతా బాగానే ఉంది కానీ.. ఇన్ని రోజులు ఒక లెక్క ఈ రెండు రోజులు ఒక లెక్క అన్నట్టుగా పరిస్థితులు ఉండనున్నాయి. ఇప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యేవరకు సమీకరణాలు వేరేలా ఉంటాయి. ఇప్పటివరకు పోటాపోటీగా ప్రచారాలు జరిపి ఓటర్లను ఆకర్షించేందుకు కృషి చేసిన రాజకీయ పార్టీలు.. ఇప్పుడు వారిని ప్రసన్నం చేసుకునేందుకు వాళ్ల దగ్గరున్న చివరి అస్త్రాలను ప్రయోగించనున్నాయి. నగదు, మద్యం, గిఫ్టులు.. ఇలా రకరకాల తాయిలాలను గుట్టుచప్పుడు కాకుండా నేతలు సమర్పించుకోనున్నారు. నిఘా కంటికి ఏమాత్రం కనిపించకుండా.. చాటుగా లక్ష్మీదేవి చేతులు మారుతూ.. నేతల తలరాతను రాత్రికి రాత్రే మార్చే అవకాశం ఉంది. అయితే.. నగదు, మద్యం ప్రవాహాన్ని అరికట్టేందుకు పోలీసులు పకడ్బంధీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ.. ప్రత్యేక నిఘా పెట్టారు. అయినప్పటికీ.. చాప కింద నీరుగా.. పంపకాల కార్యక్రమం నడుస్తూనే ఉంటుంది. వాళ్లు వీళ్ల మీద, వీళ్లు వాళ్ల మీద ఆరోపణలు చేసుకుంటూ.. మొత్తానికి చేరాల్సింది చేరాల్సిన చోటికి చేర్చే ప్రయత్నాలు మాత్రం గట్టిగానే చేసే అవకాశం ఉంది.

## స్కిల్ కేసులో బెయిల్‌పై విచారణ

### డిసెంబర్ 11కు వాయిదా వేసిన సుప్రీం



న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమ సమాజం):స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ డిసెంబర్ 11వ తేదీకి వాయిదా పడింది. జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ కుమార్ మిశ్రా ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చిన వెంటనే ఈ అంశపై ఇతర బెంచ్ ముందు ఉన్న క్వాష్ పిటిషన్ పై తీర్పు రావాల్సి ఉన్నందున పిటిషన్ పై విచారణ వాయిదా వేస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ సమయంలో సీఐడీ తరపు లాయర్లు హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉన్నాయని వాదనలు వినిపిస్తామన్నారు. ఈ అంశంపై చంద్రబాబుకు నోటీసులు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

